# 7. రాజూ - రాణీ - ఫైలూ

భరత్ పూర్ సంస్థానాధీశులైన హిజ్ హైనెస్ మహారాజా కిషన్ సింగ్ వారికి ఇహలోక సుఖాలనుభవించేందుకుగాను ఉన్న ఇరవై నాలుగు గంటలూ ఏమూలకూ చాలేవిగావు.

మహారాజావారు ఆరితేరిన రసిక శిఖామణులేగాక మంచి మధుపాన ప్రియులు కూడా కావటం శ్రీవారి అంతరంగిక కార్యదర్శి కన్వర్ భరత్ సింగ్‌కు ఓ పెద్ద సమస్యగా తయారయింది.

సంస్థాన పాలనా వ్యవహారాలకు సంబంధించిన ముఖ్య సమస్యల విషయంలో మహారాజా వారి ఆమోద ముద్రలు లేందే ఏ పనీ జరగటానికి వీలులేదు అలాగని కొన్ని కొన్ని ముఖ్య వ్యవహారాల్ని మహారాజా వారికి తీరికా, ఓపికా దొరికే దాకా ఆపటానికీ వీలులేదు.

మహారాజా వారి నిర్ణయాల కోసం నివేదితమయిన ఫైళ్ళు అసంఖ్యాకంగా అంతరంగిక కార్యదర్శి వద్ద పేరుకు పోసాగటంతో అతననేక సార్లు సవినయంగా మహారాజా వారికీ విషయం విన్నవించుకున్నాడు.

ఆ ఫైళ్ళలో అత్యంత ముఖ్యమైన సంస్థాన వ్యవహారా లనేకం ఉండేవి హత్య కేసులూ, సివిల్ కేసులూ, లక్షల రూపాయలకు సంబంధించిన వ్యవహారాలూ, అధికారుల నియామకాలకూ, ఉద్వాసనలకూ సంబంధించిన ప్రతిపాదనలూ, ప్రమోషన్ల గొడవలూ, రాజకుటుంబ వ్యవహారాలూ, సంస్థాన అంతరంగిక రాజకీయ వ్యవహారాలూ ఆదిగాగల అనేక విషయాలు ఉండేవి.

అవన్నీ చదివి తన తీర్పును ఇవ్వటం మహారాజా వారి బాధ్యత. వారి నిర్ణయానికీ, సంతకానికీ ఇహ తిరుగంటూ లేదన్నమాట.

ఆ ఫైళ్ళు ఎంత ముఖ్యమయినవో మహారాజా వారి తీర్పులూ అంత ముఖ్యమైనవే.

ఒక్క సంతకంతో శ్రీవారొక బిక్కా ఫకీరును లక్షాధికారిని చేసి వేయగలరు, కోటీశ్వరుడిని దివాలా తీయించనూ గలరు.

చదువూ సంధ్యాలేని వాడిని మహా మంత్రి పీఠంపై కూర్చో బెట్టనూ గలరు, ఉన్న మంత్రిని పీకి పాతిపెట్టనూ గలరు.

నిరపరాధిని గుండు కొట్టించి గాడిద మీద ఊరేగించి నడిబజార్లో ఉరితీయించనూ గలరు. హంతకుడిని నిర్దోషిగా ప్రకటించి పరువు నష్టం కూడా ఇప్పించి రక్షక దళాధికారిగా నియమించనూ గలరు.

భూస్వామి అన్యాయానికో, వడ్డీ వ్యాపారి దురాశకో బలిగానున్న పేద రైతును రక్షించి అతని కుటుంబాన్ని బ్రతికించనూ గలరు. వాడి కడుపుకొట్టి, ముక్కలుగా నరికి పెద్దలకు విందు చేయనూ గలరు.

అలాంటి మహారాజా వారి నిర్ణయాల కోసం, సంతకాల కోసం అసంఖ్యాకంగా ఫైళ్ళు పోగుపడి పోసాగాయి. ఆ ఫైళ్ళనిండా ఇటువంటివే సవాలక్ష ఆస్థాన వ్యవహారాలున్నాయి.

కాని...కాని.

ఉన్నది రోజుకు ఇరవై నాలుగు గంటలు మాత్రమే.

అంటే మహారాజా వారికి నిద్రించేందుకు కూడా తీరిక లేనంత వేగంగా కాలం గడచి పోతూందన్న మాట.

ఈ జీవితమనేది ఇహలోక సుఖాలన్నీ పూరాగా అనుభవించి ఆనందించేందుకే ననేది మహారాజా. వారిప్రియ సిద్ధాంతంవారా సిద్ధాంతాన్ని అక్షరాలా ఆచరించి మరీ చూపుతున్నారు కూడా.

కాని, సంస్థాన వ్యవహారాలు పరిశీలించకపోతే ఎలా ? మామూలు రోజుల్లో అయితే దేశం, ప్రజలు ఎలా తగలడినా ఎవడికీ పట్టదు, ఖజానా నిండుతూన్నంతకాలమూ.

అయితే ప్రస్తుతం ఏ మహారాజా వారు కూడా అలా నిర్లక్ష్యంగా ఉండ వీలులేని స్థితిని కల్పించారు బ్రిటిష్ వాళ్ళు. వాళ్ళు అన్ని సంస్థానాల మీదా పెత్తనం సంపాదించాలనే మూల సిద్ధాంతంతో గుడ్లగూబల్లా, రాబందుల్లా, సంస్థానాధీశుల పాలిటి యముళ్ళలా కాచు కూర్చున్నారు.

పాలనా వ్యవస్థలో ఏ మూల ఏ చిన్న లోపం కనుపించినా బ్రిటిష్ వాళ్ళు తక్షణం అక్కడ కాలుపెట్టి సంస్థానాధీశుల జెండాలు పీకి తమ పతాకాన్నెగర వేస్తున్నారు.

అందుకని హిజ్ హైనెస్ మహారాజా కిషన్ సింగ్ ఓ అపూర్వమైన ఉపాయం ఆలోచించేరు. మహారాజా వారు ప్రతి ఆదివారం ఆ వారంలో వచ్చే ఫైళ్ళను పరామర్శించి, తీర్పులు ఇచ్చి సంతకాలు చేసేందుకు అంగీకరించేరు.

అంతరంగిక కార్యదర్శితో ఫైళ్ళ నన్నింటినీ తన భవనంలోని సమావేశ మందిరంలో గల బ్రహ్మాండమైన టేబిల్‌పై అమర్చపలసిందిగా ఆదేశించేరు.

ఆటేబిల్ దాదాపు ఆ సువిశాలమైన విలాస మందిరంలో సగభాగాన్నాక్రమించేది. సుమారు ఓ వందమందా టేబుల్ ముందు కూర్చుని విందారగించవచ్చును. మహారాజా వారు ముఖ్యమైన విందు లక్కడే చేస్తూండటం జరుగుతోంది కూడా.

అంతరంగిక కార్యదర్శి మహాశయుడు మహారాజా వారి ఆదేశాన్ని తక్షణం అమలు పరిచేడు.

మహారాజావారు ప్రతి ఆదివారం సాయంత్రం ఆట విడుపుగా అంతపురం నుండి బయటపడి రాణివాస సమేతంగా ఆ కాన్ఫరెన్స్ హాలుకు విచ్చేసేవారు.

వచ్చి, గుట్టలుగా నున్న ఆ ఫైళ్ళలో ఎవరికి తోచినవి వారు తీసి టేబిల్‌కు అటుకొన్ని, ఇటు కొన్నీ సర్థవలసిందిగా రాణులకూ, మహారాణులకూ ఆదేశించేవారు. వారున్నూ అదొక ఆటగా తీసుకుని అలాగే సర్దేవారు.

ఈలోగా అక్కడ ఖరీదైన నిషాద్రవ్యాలు మహారాజా వారూ వారి స్త్రీలూ పీకల దాకా సేవించే వారు. ఇహ సేవించగల ఓపిక తగ్గగానే మహారాజా వారా ఫైళ్ళ వద్దకు వచ్చేవారు.

టేబిల్‌కు ఓ వైపున సర్దబడిన ఫైళ్ళను చూడకుండానే, చదవకుండానే ఆమోదిస్తూ సంతకం చేసేశేవారు. అలాగే మరోవైపున సర్దబడిన ఫైళ్ళను తిరస్కరిస్తూ సంతకాలు చేసి పారేసే వారు. ఆవన్నీ చదవటం శుద్ధ దండగని మహారాజా వారి దృఢ విశ్వాసం.

ఆ పని పూర్తవగానే మహారాజా వారు స్త్రీజన సమేతంగా రాణీవాసానికేగేవారు.

ఆ మర్నాడు అంతరంగిక కార్యదర్శి గారు వచ్చి, ఆ ఫైళ్ళను మోయించుకు వెళ్ళి ఆ ప్రకారం పనులు జరిపించే వారు. అడ్డర్లువేయించే వారు.

ఇలా కొద్ది వారాలు జరగగానే ఫైళ్ళనేవి నిలువ అంటూ ఉండకుండా పోయేయి.

కాని. సంస్థానంలో మాత్రం గగ్గోలు మొదలయింది. నిరపరాధులు శిక్షితులైనారు, అపరాధులు బయట పడ్డారు రెవెన్యూ, సివిల్ విషయాలు

అయోమయంగా తయారయినాయి. సంస్థానానికి రావలసిన అనేక బాకీలు రద్దయి పోయాయి. ఏమీ ఇవ్వనక్కర్లేని వారి నెత్తిన అప్పులు రుద్దబడి నాయి. ఈ అవక తవకలకు హద్దనేదే లేక పోయింది.

ఇదంతా మహారాజా వారి చేతి చలవేనని అందరికీ తెలుసుగానీ, ఇలా ఎందుకు తీర్పులు వస్తున్నాయనేదిగానీ, మహారాణుల చేతులు కూడా ఈ తీర్పుల వెనుక ఉన్నాయనేదిగానీ ఎవరికీ తెలియదు.

తత్ఫలితంగా సంస్థానంలో దాదాపు తిరుగుబాటు లాంటిది బయలు దేరింది, ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా.

మహారాజావారి కిదేం పట్టదు. అసలు వారికి తీరికెక్కడా?

కాని, బ్రిటిష్ గుడ్లగూబ మాత్రం తక్షణం కదిలి సంస్థానం మీద వాలింది. వైస్రాయిగారు తన బంటునొకడిని ఆ సంస్థానానికి సర్వాధి కారాలతో దివాన్‌గా నియమించి, మహారాజా వారి కోరలూడబీకి నామ మాత్రుడినిగా మిగిల్చి పారవేశారు.

అయితేనేం, మహారాజావారు సంతోషించేరు.

వెధవ ఫైళ్ళ కోసం అమూల్యమైన కాలాన్ని వృధా చేసుకునే పీడ విరగడయింది గదా అని.

★